క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్ : మండలంలో నాచారం గ్రామానికి చెందిన సామాల లత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి ఆస్పత్రి సహాయకుడు ద్వారా బుధవారం కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు..

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి మండల పరిధిలో పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం అప్పగించినట్లు స్థానిక సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నాలుగు ఫోన్లను రికవరీ చేసి అప్పగించినట్లు చెప్పారు. సెల్ ఫోన్ పోయిన వెంటనే బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు పేర్కొన్నారు.

14లోపు దరఖాస్తులు అందజేయాలి

మొగుళ్లపల్లి : రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను, వాటికి సంబంధిత జిరాక్స్ ప్రతులతో పాటు కలర్ పాస్ ఫొటోను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీలోపు అందజేయాలని ఎంపీడీఓ ఎండీ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు 'విద్యుత్' లోకల్ కోర్టు

చిట్యాల/టేకుమట్ల/మొగుళ్లపల్లి : విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టును నేడు (గురువారం) చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో టీజీ ఎస్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్-1 చైర్మన్ వేణుగోపాల చారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మొగుళ్లపల్లి ఇన్‌చార్జ్ ఏఈ సంజయ్, చిట్యాల ఏఈ చంద్రశేఖర్, టేకుమట్ల సెక్షన్ ఏఈ మణిదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, విద్యుత్ నియంత్రికల మార్పు, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కోర్టును నిర్వహిస్తామన్నారు. మండలంలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు భూసేకరణ గ్రామసభ

కాటారం : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా ఆదివారంపేట చెరువు పరిధిలో ప్రధాన కాల్వల నిర్మాణానికి భూ సేకరణ చేసేందుకు నేడు(గురువారం) మండలంలోని మూడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. జాదారావుపేట గ్రామపంచాయతీలో రఘుపల్లి, జాదారావుపేట, వీరాపూర్ గ్రామాలకు సంబంధించిన భూ సేకరణ గ్రామసభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కెనాల్స్ నిర్మాణం కోసం ఆయా గ్రామాల నుంచి 45.39 ఎకరాల భూమి సేకరణ చేపట్టనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులు పాల్గొని తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు గ్రామసభ ద్వారా తెలపాలని కోరారు.

విద్యుత్ తీగలతో జాగ్రత్త

భూపాలపల్లిరూరల్ : ఈదురు గాలులు, అకాల వర్షాల ప్రభావంతో విద్యుత్ తీగలతో జాగ్రత్త వహించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. తడిసిన విద్యుత్ స్తంభాలను, సపోర్టు వైర్లను, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకరాదన్నారు. ఏలాంటి సమస్య ఉన్న విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

చర్య తీసుకోవాలి



భూపాలపల్లి అర్బన్ : మండలంలోని పెద్దాపూర్ శివారులో వ్యవసాయ భూములకు వెళ్లే దారిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వీరమనేని సుధాకర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దాపూర్ శివారులోని గోపయ్యపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 40, 65, 66, 67ల పక్కన ఉన్న రోడ్డును అదే గ్రామానికి చెందిన బండ శ్రీధర్‌రావు ఆక్రమించి పామాయిల్ మొక్కలు నాటినట్లు తెలిపారు. దీనిపై గ్రామస్తులతో పాటు కలెక్టర్, ఎస్పీలకు సైతం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

క్షుద్ర పూజల కలకలం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం) శివారు రోడ్డుపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు భయాందోళను గురవుతున్నారు. క్షుద్ర పూజలు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని గుర్తించి శిక్షించాలని కొత్తపల్లి గ్రామస్తులు పోలీసులను, అధికారులను కోరుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

నామమాత్రంగా వసతులు
- ఇష్టారాజ్యంగా పెట్రోల్ బంక్‌ల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



ఆశిరెడ్డిపల్లిలోని పెట్రోల్ బంక్



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి



బంక్ వద్ద పని చేయని ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు

టేకుమట్ల : వాహనాల వినియోగం పెరుగుతున్న తరుణంలో (ఫిల్లింగ్ స్టేషన్) పెట్రోల్ బంక్‌లను సైతం పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తోంది. ఈక్రమంలో మండల కేంద్రంతో పాటు, ఆశిరెడ్డిపల్లి, వెలిశాల శివార్లలో వివిధ కంపెనీలకు చెందిన ఫిల్లింగ్ స్టేషన్లు ప్రధాన రోడ్ల వెంట ఏర్పాటు చేయడంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధనాన్ని నింపుకుంటూ ప్రయాణిస్తున్నారు. కాగా ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహణ, సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం విధించిన షరతులను కొన్ని పెట్రోల్ బంక్‌ల్లో పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా వినియోగదారులకు కనీస సౌకర్యాలను కల్పించాల్సిన యజమానులు, నిర్వాహకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వినియోగదారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం చేస్తే పొంచి ఉన్న ప్రమాదం..

పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వాహనాల ఇంజిన్‌ను ఆఫ్ చేసిన తర్వాతనే ఇంధనం నింపాలి. కానీ కొంత మంది వాహనదారులు వాహనాల ఇంజిన్‌ను ఆన్‌లో ఉండగానే ఆయిల్ నింపుకుంటున్నారు. అలాంటి సందర్భంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఆస్తి నష్టంతో పాటు, ప్రాణనష్టం కూడా వాటిల్లే ప్రమాదం ఉంది. ఇంధనం నింపే చోటులో తప్పని సరిగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలా అరకొర వసతులను ఏర్పాటు చేసి, పరిశుభ్రతను గాలికొదిలేసి కనీస భద్రతా చర్యలు పాటించకుండా వ్యవహరిస్తున్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సదుపాయాల కల్పనతో పాటు, భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పలు కంపెనీల టోల్ ఫ్రీ నంబర్లు

ఇండియన్ ఆయిల్-	1800233355
భారత్ పెట్రోలియం-	1800224344
హెచ్‌పీసీఎల్-	18002333555
రిలయన్స్ -	18008919023

అందించాల్సిన కనీస సౌకర్యాలు

- అత్యవసర సమయంలో ఇంధన వినియోగదారులకు అందించాల్సిన ప్రాథమిక వైద్య పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు, వాటిని ఎప్పటికప్పుడు మార్చుతూ ఉండాలి. ప్రతీ రోజు పెట్రోల్ బంక్‌కు వచ్చే వారి కోసం శుద్ధమైన తాగునీటిని నిరంతరం అందించాలి. మరుగుదొడ్లను ఏర్పాటు చేసి, నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- అత్యవసర సమయంలో కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సమాచారం అందించేందుకు ఫిల్లింగ్ స్టేషన్‌లో ల్యాండ్‌లైన్, లేదా మొబైల్ ఫోన్ సౌకర్యాన్ని కల్పించాలి.
- వాహన చక్రాల్లో గాలి తక్కువగా ఉండి ప్రయాణం నిలిచిపోకుండా ఉండేందుకు 24గంటల పాటు ఎయిర్ కంప్రెషర్‌ను వాహనదారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఇంధన నాణ్యత, సిబ్బంది పని తీరు, ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహణపై వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు 'ఫిర్యాదుల బాక్స్'ను ఏర్పాటు చేయాలి.
- పెట్రోల్, డీజిల్ నాణ్యత, కొలతకు సంబంధించిన అనుమానాలు ఉంటే వినియోగదారుడు తనిఖీ చేసుకునేందుకు కావాల్సిన పరికరాలను అందుబాటులో ఏర్పాటు చేయాలి.

గాలి లేదంటున్నారు



వ్యక్తిగత పని నిమిత్తం హుజూరాబాద్ నుంచి వెలిశాలకు వెళ్తున్నాను. కాస్త జ్వరం రావడంతో పాటు, బైక్ టైర్‌లో గాలి తక్కువ ఉందని ఆశిరెడ్డిపల్లిలోని పెట్రోల్ బంక్‌లోని పని చేస్తున్న సిబ్బందిని అడిగా. తమ వద్ద మందులు ఎందుకు ఉంటాయని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. అలాగే టైర్‌లో గాలి నింపాలంటే లేదని చెప్పారు. కనీస నిబంధనలు పాటించని పెట్రోల్ బంక్ యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బొడ్డు తిరుపతి, హుజూరాబాద్

పోషకాహారంతో రోగనిరోధక శక్తి

- డాక్టర్ కల్యాణి



మాట్లాడుతున్న వైద్యాధికారి కల్యాణి

పలిమెల : చిన్నారులు సమపాలల్లో పోషకాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి మెరుగుపడి ఎలాంటి వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కల్యాణి అన్నారు. బుధవారం మండలంలోని పంకెనలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితే పంకెనలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లేదా అంబటిపల్లిలోని పీహెచ్‌సీ, మహాదేవ్‌పూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్యాణి మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో అందించే సమతూల్య పౌష్టికాహారాన్ని వృథా చేయకుండా సక్రమంగా భుజించాలని తెలిపారు. దీంతో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని వివరించారు. ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే జ్ఞాపకశక్తి పెరిగి చక్కగా చదవగలరని సూచించారు. అనారోగ్య సమస్య ఏర్పడితే ఆశ్రమ పాఠశాలలోని నర్సుకు, ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జగదీశ్ ఖన్నా, హెచ్‌వీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం బ్యూలా, శ్రీలత, ఆశ కార్యకర్తలు సమ్మక్క, సుజాత, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని చింతకుంటరామయ్యపల్లి ప్రధానోపాధ్యాయుడు శనిగరపు భద్రయ్య కోరారు. ఈ సందర్భంగా బుధవారం చింతకుంట రామయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పాఠశాలలోనే తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించాలని కోరారు. విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, భోజనం, దుస్తులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి ప్రసాద్, జ్యోతిబాయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కాటారం : మండలంలోని సుందరాజ్‌పేట అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుంభం రమేశ్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఐత శంకరయ్య, ఉపాధ్యక్షులుగా దాసరి సదయ్య, మంతెన సతీశ్, తోడె మాధవరెడ్డి, బొగిరి సమ్మయ్య, చీర్ల బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాగె రవికుమార్, కార్యదర్శులుగా చిట్యాల శశికుమార్, తోడె అనిల్, చిట్యాల ప్రభాకర్, కోట రమేశ్, రాజ్‌కుమార్, వెంకన్న, కోశాధికారి సంతోషం బాపురెడ్డి, సంయుక్త కోశాధికారులు కన్నీరు స్వామి, కుంభం సురేశ్, తోడె రవీందర్, ప్రచార కార్యదర్శి రవీందర్, సహాయక ప్రచార కార్యదర్శులుగా అశోక్, సాయికిరణ్, రామయ్య, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం : మహాముత్తారం మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. మండల కేంద్రానికి చెందిన తాటి వెంకటేశ్వర్లు–రాణి దంపతులు రూ.1.20 లక్షలతో ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతి కోసం సర్వాయి పాపన్న ఎనలేని పోరాటం చేశారన్నారు. ఆయన పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డం లింగయ్య, సభ్యులు తాటి లచ్చయ్య, మారగోని బాపు, ముక్కెర రాజయ్య, తాటి బాపు, మార్క రాము, శ్రీపతి సురేశ్, రమేశ్, బుర్ర వెంకటేశ్, శ్రీరామ్ రమేశ్, లింగయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండ: పరామర్శిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి



టేకుమట్ల: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రేగొండ : మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన సాదు పోశయ్య, కొత్తపల్లిగోరి మండలం విజ్జయ్యపల్లి గ్రామానికి చెందిన ఆరె కట్టయ్య, చెన్నాపూర్ గ్రామానికి చెందిన పల్లెబోయిన సమ్మక్క ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సాదు నగేష్, అంకూష్, చంద్రారెడ్డి, సుధాకర్ ఉన్నారు.

ఆర్థికసాయం

టేకుమట్ల : మండల కేంద్రానికి చెందిన ఓనపాకల శ్రావణ్ కుమార్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, నివాళులర్పించారు. అనంతరంరూ.12వేలను ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రెడ్డి మల్లారెడ్డి, బందెల నరేష్, పోతనవేని ఐలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు ఆది రఘు, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, నేరేళ్ళ శ్రీనివాస్, బొడ్డు సదానంధం, అభిరాజు, నిమ్మల స్వామి, గువ్వాడి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో



నష్టపరిహారం అందించాలని జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

గోవిందరావుపేట: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జాతీయ రహదారిపై తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో దుంపెల్లిగూడెం క్రాస్ వద్ద బుధవారం గంటసేపు రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం నాయకుడు తుమ్మల వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు లక్నవరం చెరువు కింద 6వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అదే విధంగా వందలాది ఎకరాల్లో మామిడి తోట పూర్తిగా దెబ్బతిందని వివరించారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలన్నారు. అదే విధంగా పలు ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. రాస్తారోకో విషయం తెలుసుకుని ఎస్సై కమలాకర్ అక్కడకు చేరుకుని సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. వెంటనే రైతులందరూ తహసీల్దార్ సృజన్‌కుమార్ అందజేశారు. వినతి పత్రాన్ని తహసీల్దార్ సృజన్ కుమార్‌కి ఆందజేశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వరిపైరును పరిశీలిస్తున్న నాయకులు

అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని చల్వాయిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేల్పుగొండ ప్రకాశ్ ఆధ్వర్యంలో నాయకులు వడగండ్ల వానకు దెబ్బతిన్న మామిడి తోటలను, వరి పంటలను పరిశీలించారు. పైడాకుల కృష్ణమూరి మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటికే అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారని, నష్టం కలిగిన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గనపాక సుధాకర్, గుండెబోయిన అనిల్, బొనగాని సారయ్య, సుదర్శన్, నర్సయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయాల్లో కార్యకర్తల పాత్ర మరువలేనిది

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రా రెడ్డి



మొగుళ్లపల్లి : మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి



చిట్యాల: మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

మొగుళ్లపల్లి : భారతీయ జనతా పార్టీ విజయాల్లో పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, వారి శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకమని, కొన్ని సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రా రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు మోరే వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చదువు రామచంద్ర రెడ్డి, రవీందర్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో ప్రజలంతా బీజేపీ సుపరిపాలనను చూస్తున్నారని, ఇటీవల పార్టీ సాధించిన అనేక చారిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందన్నారు. దేశ పురోగతికి ×వికసిత్ భారత్ట్ స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 1980లో స్థాపించిన భారతీయ జనతా పార్టీ 1984లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో రెండు లోక్ సభ స్థానాలను మాత్రమే గెలుచుకొని ఆ తర్వాత అటల్ బిహారీ వాజ్ పేయ్, ఎల్కె అద్వానీ నాయకత్వంలో అంచెలంచెలుగా ఎదిగి..1990లో మిత్రపక్షాలతో కలిసి బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకుందన్నారు. అనంతరం 2014 నుంచి ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుదీరిందన్నారు. దేశ ప్రజల రక్షణే లక్ష్యంగా..ప్రజల అభివృద్ధే ధ్యేయంగా..వారికి సుపరిపాలనను అందిస్తున్న నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలో కాషాయ జెండాను ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించేలన్నారు., ఆరు గ్యారంటీలు..420 హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు కుమ్మరి సారయ్య, జమలాపురం సాంబశివరావు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు పుల్యాల రాజు, మంద రాజేష్ మండల ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బలుగూరి కిషన్‌రావు, రాస భిక్షపతి అనుముల శ్రీనివాస్, పులి వెంకట్ రెడ్డి, వైనాల ప్రియాంక శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి'

చిట్యాల : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లింగంపల్లి ప్రసాద్‌రావు హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించేలా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాచర్ల రఘు, గుండ సురేష్, చెన్నమనేని సంపత్, గజనాల రవీందర్, శ్రీహరి, సదానందం, శ్రీకాంత్, రాజేందర్, రాజు, వీరస్వామి, తిరుపతి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్హర్ : మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

మల్హర్ : మండలంలోని కొయ్యూరులో బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గామ్ చలో, బస్తీ చలో కార్యక్రమం గురించి సభ్యులకు వివరించారు. ప్రతి గ్రామంలోని క్రియాశీల కార్యకర్తలందరూ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సభావత్ నాగరాజు, లింగన్నపేట అశోక్. గంగాధర్ సమ్మయ్య, తోటపల్లి మహేందర్ రెడ్డి, రాళ్లబండి ప్రశాంత్, వెన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, అంగజాల రాకేష్, ఎస్కే నిశాన్, వేమునూరి సతీష్ రెడ్డి, జంగ లక్ష్మీనారాయణ, కంబాల శ్రీకాంత్, గాదనవేణి రాజయ్య, అక్కల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

ఏటూరునాగారం : ఏటూరునాగారంలోని 50 పడకల ఆస్పత్రికి రూ.22 కోట్ల నిధులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేసిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఖలీల్‌ఖాన్, గుడ్ల దేవేందర్, ముక్కెర లాలయ్య, వావిలాల నర్సింహారావు, ఎల్లయ్య, మధుబాబు, శ్రీనివాస్, గౌస్‌పాషా, గద్దల నవీన్ తదితరలు ఉన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం : రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర చేపడుతున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆదివారంపేట,ఒడిపిలవంచ, గుమ్మాళ్లపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలు, రాజ్యాంగం పుస్తకంతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగాన్ని అపహస్యం చేసేలా వ్యవహరిస్తోందన్నారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరికి రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంగజాల అశోక్, కొట్టె ప్రభాకర్, చీర్ల తిరుపతిరెడ్డి, కొట్టె శ్రీహరి, కోడి రవికుమార్, బండారి శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి

భూపాలపల్లి రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు రైతులకు పంటలకు ఇస్తామన్న గిట్టుబాటు ధరను చెల్లించి, హామీలను నిలబెట్టుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడాల సమ్మిరెడ్డి కోరారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడారు. పంటకు గిట్టుబాటు ధర, రైతు రుణమాఫీ, రైతుబంధు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి రైతుల సంక్షేమం కోసం పాటుపడకుండా నిత్యావసర ధరలు పెంచడం సరికాదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గుంటి చంద్రమౌళి, నాయకులు పెంట రవి, రాజయ్య, రాజేందర్, నబి, కుడుదుల వెంకటేష్, జోసఫ్, ముత్తయ్య, అఫ్జల్ పాషా తదితరులు పాల్గొన్నారు.